ఇంటింటా భోగి వేడుకలు


భోగి మంటలు వేసిన దృశ్యం


హరిదాసుకు కానుకలు ఇస్తున్న మహిళ


గంగిరెద్దుకు ధాన్యం తినిపిస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలో భోగి రోజు శనివారం తెల్లవారుజామున పలువురు ఇంటి ముందు భోగి మంటలు వేసి, కల్లాపు చల్లి రంగురంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలను ఉంచి పూలతో అలంకరించారు. అనంతరం మంగళస్నానం ఆచరించి సద్దరొట్టెలు, వివిధ రకాల కూరగాయలతో కూరలు వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి, గుమ్మడికాయలతో ఇంటికి దిష్టి తీశారు. సాయంత్రం చిన్నారులకు రేగు పండ్లు, చెరుకు ముక్కలు, చాక్లెట్లు, చిల్లర నాణేలు కలిపి పోశారు. అనంతరం గంగిరెద్దుల వారికి, హరిదాసులకు దానాలు చేశారు.

దొర్నిపాడు: మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం భోగి సందర్భంగా వేకువ జాము నుంచే ఇళ్ల ముందు భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలికారు. ముఖ్యంగా మండలంలోని రామచంద్రాపురం, భాగ్యనగరం, అమ్మిరెడ్డినగరం, వెంకటేశ్వరనగరం, ఉమాపతినగరం గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట కల్లాపు చల్లి సంక్రాంతి ముగ్గులు, భోగి మంటలు, ఆటల పోటీలు నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. పువ్వాడ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. నాయకులు బబ్బూరి వెంకటస్వామి, మోల్పూరి దయానందరావు, బబ్బూరి ఉమాదేవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న చిన్నారులు →

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు గోపీ శర్మ, శివకుమార్ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు విశేష పూజలు గావించి, పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భోగి పర్వదినం కావడంతో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, న్యాయవాది సూర్యనారాయణరెడ్డి, నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల అధినేత రామకృష్ణారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


నాయకులకు మెమొంటో అందజేస్తున్న దృశ్యం

బైక్‌ల దొంగ అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో పలు ప్రాంతాల్లో ఐదు బైక్‌ల చోరీకి పాల్పడిన నిందితుడిని తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ వలి ఆటోనగర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు ఎక్కువగా ఉండటంతో మెకానిక్ పని చేసిన డబ్బులు సరిపోకపోవడంతో చోరీలకు పాల్పడ్డాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నంబరు ప్లేట్లు లేని వాహనాలను దొంగలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఆటోనగర్ సమీపంలో నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. చోరీకి గురైన బైక్‌లను స్వాధీనం చేసుకొని మహమ్మద్ వలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.


నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

వాహనాల పార్కింగ్ స్థలం పరిశీలన

మహానంది: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భక్తుల వాహనాల పార్కింగ్ కోసం అవసరమైన స్థలాన్ని శనివారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈఓ మాట్లాడుతూ గతంలో మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాలకు ఆలయానికి దూరంగా పార్కింగ్ ఏర్పాటు చేసేవారమన్నారు. అయితే ప్రస్తుతం దేవస్థానానికి చెందిన భూములను అభివృద్ధి చేసి శాశ్వత ప్రాతిపదికన వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేశామని చెప్పారు. రూరల్ సీఐ రవీంద్ర పార్కింగ్ ప్రదేశానికి చేరుకుని పలు అంశాలపై చర్చించారు. టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాల పార్కింగ్ ప్రత్యేకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఢీ అంటే ఢీ

పగిద్యాల: సంక్రాంతి తిరుణాలను పురస్కరించుకుని పడమర ప్రాతకోట కాశీవిశ్వేశ్వర, నందీశ్వర స్వామి దేవాలయం వద్ద శనివారం రాత్రి నిర్వహించిన జిల్లా స్థాయి రెండు పళ్ల పొట్టేలు పందెం పోటీలను ఎస్‌ఐ నాగార్జున ప్రారంభించారు. పోటీల్లో 14 జతల పొట్టేళ్లు పాల్గొన్నాయి. ప్రాతకోట శ్రీకాంత్ పొట్టేలు, గోరుకల్లు మణికి చెందిన పొట్టేళ్లు పోరాడగా.. గోరుకల్లు మణి పొట్టేలు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో ప్రాతకోట శ్రీకాంత్ పొట్టేలు నిలిచింది. మూడో విజేతగా దామగట్ల లడ్డు పొట్టేలును నిర్వాహకులు ప్రకటించారు. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ. 4 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యి నగదు బహుమతిని నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు మీదుగా అందజేశారు. కో ఆప్షన్ మెంబర్ అస్లాంబాషా, సహకార సొసైటీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్, నాయకులు పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మిద్దె మోక్షం, రమణ ప్రసాద్, అంబటి శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


తలపడుతున్న పొట్టేళ్లు

హ్యాండ్‌బాల్ పోటీల్లో నంద్యాల జట్టు ప్రతిభ

గన్నవరం: కృష్ణా జిల్లాలోని గన్నవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల 37వ సబ్ జూనియర్, 44వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల విజేతగా విశాఖపట్నం, రన్నర్స్‌గా నంద్యాల జట్లు నిలిచాయి. జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో కర్నూలు, విజయనగరం జట్లు, సబ్ జూనియర్స్ విభాగంలో అనంతపురం, తూర్పు గోదావరి జట్లు తృతీయ స్థానం సాధించాయి. అనంతరం వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు ఒలింపిక్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రావు, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన హ్యాండ్‌బాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా అసోసియేషన్‌ను కేపీ రావు అభినందించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి జె.సింహాచలం, కోశాధికారి టి.శిరీష, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా శోభన్‌బాబు జయంతి

నంద్యాల(అర్బన్): సినీ నటుడు శోభన్‌బాబు 87వ జయంతిని అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. శోభన్‌బాబు సేవా సమితి గౌరవాధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో నూనెపల్లెలో నిర్వహించిన వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్ల పంపిణీ చేశారు. నాయకులు అన్నయ్య, రమణ, జానకి, లక్ష్మయ్య, అయూబ్, దస్తగిరి, విజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న అభిమానులు

కమనీయం..గోదాదేవి కల్యాణం


సంజీవనగర్ రామాలయంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం


రోజాకుంట దేవాలయంలో కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లు


మెయిన్ బజార్‌లోని అమ్మవారిశాలలో గోదాదేవి కల్యాణం


వేడుకను తిలకిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శనివారం గోదాదేవి రంగనాథస్వామి వారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేసి వజ్రాభరణ కవచంతో అలంకరించారు. గోదాదేవి, రంగనాథస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిపించి పండితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కంకణ ధారణ, నలుగు, మాంగళ్య ధారణ తదితర కార్యక్రమాలు చేపట్టి తలంబ్రాల తంతు పూర్తి చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు మహామంగళ హారతులు ఇచ్చారు. దీవీ హయగ్రీవాచారి గోదాదేవి కల్యాణ వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. వేడుకను తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేపట్టారు.

- రోజాకుంటలోని నాగలింగేశ్వర దేవాలయంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్, ఉత్సవమూర్తులకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం పండితుడు సుదీంద్రచారి ఆధ్వర్యంలో వేదయుక్తంగా జరిపించారు.
- క్రాంతినగర్‌లోని శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను కాలనీలో గ్రామోత్సవం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.
- మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో ధనుర్మాన్ని పురస్కరించుకొని గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకను తిలకించారు.

తెప్పోత్సవానికి ముస్తాబవుతున్న వినాయక ఘాట్


ట్రయల్ రన్ నిర్వహిస్తున్న నిర్వాహకులు

నంద్యాల(వ్యవసాయం): ధనుర్మాసం ముగింపు, సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఈనెల 16వ తేదీ సాయంత్రం లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి తెప్పోత్సవం నిర్వహించడానికి చిన్న చెరువు కట్టపై ఉన్న వినాయక ఘాట్ ముస్తాబవుతోంది. చెరువులో శనివారం నిర్వహించిన తెప్ప ట్రయల్ రన్ విజయవంతమైంది. దీంతో పూర్తిస్థాయిలో ముస్తాబు చేయడానికి భగవత్ సేవా సమాజ్ సభ్యులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మొత్తం 40 మంది కూర్చునేలా ఏర్పాటు చేశారు. ట్రయల్ రన్‌లో 30 మంది ప్రయాణించి చూశారు. తెప్పోత్సవానికి తిలకించడానికి భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామని అధికారులు సమీక్షలో పేర్కొన్నారు. ఉత్సవ ఏర్పాట్లు, నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

క్లుప్తంగా

కల్యాణ మండపం ప్రారంభం

రుద్రవరం: వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో రూ.9లక్షలతో నిర్మించిన నూతన మినీ కల్యాణ మండపాన్ని శనివారం ప్రారంభించారు. కోవెలకుంట్లకు చెందిన సింగతల శ్రీనివాసరెడ్డి, ప్రియాంక దంపతులు మొక్కు చెల్లింపులో భాగంగా కల్యాణ మండప నిర్మాణానికి రూ.9లక్షలు విరాళంగా అందజేశారు. పనులు పూర్తి కావడంతో ఆలయ నిర్వాహకులు వినియోగంలోకి తీసుకొచ్చారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీన చేపట్టనున్న రాయలసీమ ధర్మ దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి కోరారు. స్థానిక సమితి కార్యాలయంలో శనివారం దీక్షకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం రిజర్వాయర్ ఉన్న కర్నూలులో బోర్డు ఏర్పాటైతే రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం,నెల్లూరు, తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆయకట్టుకు సక్రమంగా నీరు అందుతుందన్నారు. ధర్మ దీక్షకు రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు రామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాముడు, సుధాకర్ రావు, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

26న ట్రాక్టర్ల ర్యాలీ

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త ర్యాలీలో భాగంగా నంద్యాల జిల్లాలో ఈనెల 26వ తేదీన చేపట్టనున్న ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీనివాస కాంప్లెక్స్‌లోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ రైతాంగం ఉద్యమ విరమణ సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు కాలేదన్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా రైతు సంఘాలన్నీ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని నిర్ణయించాయన్నారు. మండల నాయకులు అల్లాబకాష్, సోమన్న, వీరేంద్రప్ప, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ, చౌడప్ప, మహమ్మద్, ఖాజామియా పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరిగే సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన జెండాను శనివారం స్థానిక గాంధీచౌక్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కేంద్రప్రభుత్వం విఫలమైందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తుందని ధ్వజమెత్తారు. గౌస్, వెంకటలింగం, సుబ్బారావు, జైలాన్, నరసింహ పాల్గొన్నారు.

తీరిన వీధి దీపాల సమస్య


వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని ఆలమూరులో వీధి దీపాల సమస్య తొలగింది. గ్రామంలో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ పాణ్యం లక్ష్మీదేవి 150 కొత్త బల్బులు తెప్పించారు. వాటిని శనివారం వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు నాగేష్ ,చంద్ర, ప్రభాకర్, జయరాముడు, చెన్నయ్య, ఉశేని తదితరులు స్తంభాలను అమర్చే పనులు చేయించారు. వీధి దీపాల ఏర్పాటుతో చీకటి ఇబ్బందులు తప్పాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ధనుర్మాస పూజలు

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి ఆలయాల్లో శనివారం చివరి వారం సందర్భంగా ధనుర్మాస పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయాన్నే భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి, రమణయ్య, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

నేడు ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా స్థానిక జీపీఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమై గిరిజన తండాలు, ఎరుకల కాలనీలు, చెంచుగూడేలు, యానాది కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. 15న అవుకు, బనగానపల్లె మండలాల్లో రెండు రోజుల పాటు, 17న నంద్యాల, ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో పర్యటిస్తారని వివరించారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ కె .రఘువీర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. పట్టణాల నుంచి గ్రామాలకు బైకులపై వెళ్లిన వారు పండుగ తర్వాత తిరుగు ప్రయాణంలో క్షేమంగా చేరుకోలాని సూచించారు. హెల్మెట్ ధరించి ప్రయాణించాలని కోరారు.

ముగిసిన కబడ్డీ పోటీలు


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. 40 జట్లు పాల్గొన్న పోటీల్లో శకునాల జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, నంద్యాల కాళికాంబ జట్టు రెండో స్థానం, ఆళ్లగడ్డ ప్రజ్ఞా వెలుగోడు జట్టు తరువాతి స్థానాల్లో నిలిచాయి.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామికి హారతి ఇస్తున్న మాలధారులు

నంద్యాల(అర్బన్): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. శబరిమల ఆలయ నియమాల ప్రకారం ఆలయంలో మకర సంక్రాంతిని వేడుకను చేపట్టారు. సాయంత్రం మకర జ్యోతిని వెలిగించి స్వామి వారి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం జరిపించారు. లక్ష్మయ్య గురుస్వామి, గోపి, నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జీఓ రద్దు చేయాలి

నంద్యాల(అర్బన్): ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే జీఓ నం.1ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ కోరారు. జీఓను నిరసిస్తూ శనివారం అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో జీఓ కాపీలను దహనం చేశారు. నాయకులు నరసింహులు, బాబాఫకృద్దీన్, గౌస్, మస్తాన్ వలి, సలాం మౌలానా సుబ్బరాయుడు, సోమన్న, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.